క్లుప్తంగా...

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి
మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మంజుల్కర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్ మంజలకర్‌ను బుధవారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘ సభ్యులు గుంజ శ్రీనివాస్, పెద్ద తిమ్మయ్య, డాన్ శీను, గోపాల్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం
కుత్బుల్లాపూర్: తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న జీడిమెట్ల డివిజన్‌లోరి కుత్బుల్లాపూర్ జడ్పీహెచ్‌ఎస్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావును బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సుభాష్‌నగర్: దూలపల్లిలోని శ్రీదుర్గా వెల్ఫేర్ సొసైటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం కాలనీ అధ్యక్షుడు పూజారి మహేష్‌పటేల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి చిమ్మ చీకటి నెలకొంటుందని, పలు చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు శిథిలమై వాహనదారులకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. కాలనీలోని ఓపెన్ ప్లాట్లలో పెరిగిన కలుపు మొక్కలతో సర్పాలు వస్తున్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి



ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన రామకృష్ణారెడ్డితో సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష పదవి ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. బుధవారం షాపూర్‌నగర్ పోచమ్మ గుడి వద్ద జరిగిన సంఘం ఎన్నికల్లో రామకృష్ణారెడ్డి ఘన విజయం సాధించారు. మొత్తం నలుగురు పోటీ చేయగా 68 మందిలో 66 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రామకృష్ణారెడ్డికి 48 ఓట్లు వచ్చాయి. మిగతా వారికి నామమాత్రంగా ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల నిర్వాహకులుగా హృదయరాజు, రాజారెడ్డి, గణేష్, ఏడుకొండలు, శ్రీకుమార్ వ్యవహరించారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ సడన్ బ్రేక్.. వాహనాలు ఢీ
నలుగురికి గాయాలు

దుండిగల్: మూలమలుపు వద్ద వేగంగా వెళ్తున్న బైక్ ఒక్క సారిగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. వెనుకే వస్తున్న టాటా బొలేరో వాహనం కారును ఢీ కొట్టిన ఘటనలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గండిమైసమ్మ చౌరస్తా నుంచి సూరారం వైపు బుధవారం సాయంత్రం బైక్‌పై ఓ వ్యక్తి వస్తున్నాడు. ఈ క్రమంలో బహదూర్‌పల్లి శ్రీరామ్‌నగర్ పెట్రోల్ బంక్ సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ నడుపుతున్న వ్యక్తి ఒక్క సారిగా సడన్ బ్రేక్ వేశాడు. వెనుకే వస్తున్న కారు బైక్‌ను ఢీ కొనగా కారును ఆపై వెనుక వస్తున్న టాటా బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటు బైక్ నడుపుతున్న వ్యక్తి గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు సూరారంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని దుండిగల్ పోలీసులు తెలిపారు.

డంపింగ్ యార్డు తరలించరు..
కాలేజీ భవనం ప్రారంభించరు!

గురుకుల మహిళా కాలేజీ ప్రారంభమెప్పుడో?
- హెచ్‌ఏఎల్ సీఎస్‌ఆర్ నిధులతో డిగ్రీ కాలేజీ భవనం పూర్తి
- 8 నెలల నుంచి ఎదురు చూస్తున్న వైనం
- నెలకు రూ.9 లక్షల అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వం
- చెత్త డంపింగ్ కేంద్రమే ప్రధాన సమస్య



కాలేజీ భవనం, డబుల్ బెడ్ రూం పక్కనే ఉన్న చెత్త డంపింగ్ యార్డు

ప్రభుత్వ కాలేజీ కోసం ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయ లోపంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారింది. దీంతో ప్రతి నెల నెల రూ. 9 లక్షలు ఓ ప్రైవేట్ భవనానికి అద్దె చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. గురుకుల డిగ్రీ మహిళా కాలేజీ భవనం పూర్తయ్యి సుమారు 8 నెలలు గడుస్తున్నా.. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు.

నిజాంపేట్: కార్పొరేషన్‌లోని చెత్త డంపింగ్ మూలంగా పక్కనే నిర్మించిన గురుకుల డిగ్రీ కాలేజీలో తరగతులు నిర్వహించేందుకు సాహసించడం లేదు. బాచుపల్లి మండలంలో సర్వే నెంబర్ 186లో ప్రభుత్వం నాడు నాలుగు ఏకరాల స్థలం సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీ భవనం కోసం స్థలం కేటాయించింది. భవన నిర్మాణానికి హెచ్‌ఏఎల్ సీఎస్‌ఆర్ ఫండ్స్ రూ. 22 కోట్లు మంజూరు చేసింది. 2022లో కాలేజీ భవనం కోసం గురుకుల సెక్రటరీ రోనాల్డ్‌రాస్ ఆధ్వర్యంలో శంకుస్థాన చేశారు. నాటి ప్రభుత్వం గురుకుల కాలేజీలను ఏర్పాటు చేసినప్పటి నుంచి మొదట అద్దె భవనాల్లో జగద్గిరిగుట్టలో, ప్రస్తుతం శామీర్‌పేట్‌లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. డిగ్రీ బీఎస్సీ, బీకాం కోర్సుల్లో సుమారు 840 మంది విద్యార్థులు చదువుకునే పరిమితితో ఈ భవనం నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం 550 మంది వరకు ఉన్నారు. ప్రతి నెల నెల ప్రభుత్వం ఈ కాలేజీ అద్దె భవనం కోసం సుమారు రూ.9 లక్షల వరకు చెల్లిస్తుంది. గురుకుల కాలేజీకి సొంత భవనం పూర్తయ్యి సుమారు ఎనిమిది నెలలు పూర్తవుతున్నా కాలేజీ ఇక్కడకు పూర్తి స్థాయిలో మార్చకపోవడం విశేషం.

భవనం పక్కనే డంపింగ్ కేంద్రం

కాలేజీ పక్కనే డంపింగ్ యార్డు ఉండటంతో కాలేజీని ప్రారంభించడం సాధ్యం కావడం లేదు. ఇటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం ఇక్కడ ఉన్న చెత్త డంపింగ్ యార్డును తొలగించడం లేదని గురుకుల సొసైటీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కాలేజీ ప్రిన్సిపాల్ డా. ఇష్రత్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు పలు మార్లు డంపింగ్ యార్డు తొలగించాలని విన్నవించారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ స్పందిస్తే తప్ప ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యేటట్లు లేదు.

అందరికీ ఇబ్బందులే..

డంపింగ్ యార్డు సమస్యతో పరిసర ప్రాంత ప్రజలకు అందరికీ ప్రతి నిత్యం అవస్థలే ఏర్పడుతున్నాయి. సుమారు 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన తెలుగు యూనివర్సిటీ విద్యార్థులకు, శివాజీ నగర్, సాయినగర్, ఆదిత్యగార్డెన్స్, రాజీవ్ గృహకల్ప, జర్నలిస్ట్ కాలనీ, హిల్ కౌంటీ, స్ప్రింగ్ విల్లాస్ కాలనీ ప్రజలతో పాటు ప్రస్తుతం నూతనంగా నిర్మాణం పూర్తి అయిన డిగ్రీ కాలేజీ విద్యార్థులకు సైతం ఇబ్బందులు ఎదురవుతాయి. డంపింగ్ యార్డు పక్కనే ఆనుకుని ఈ కాలేజీ నిర్మాణం జరిగింది కాబట్టి గురుకుల అధికారులు ప్రారంభోత్సవం చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. విద్యార్థులకు అనేక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తరలించాలని కోరుతున్నారు.



గురుకుల కాలేజీ ప్రాంగణం

కాలేజీని షిఫ్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం

కాలేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సొంత భవనం పూర్తి అయ్యింది. డంపింగ్ యార్డు తొలగిస్తే వెంటనే కాలేజీని వెంటనే బాచుపల్లికి షిఫ్ట్ చేస్తాం. విద్యార్థులను అక్కడికి తీసుకువచ్చి తరగతులు నిర్వహిస్తే ఇబ్బందులు తీవ్రమవుతాయి. ఈ విషయంపై ఇప్పటి వరకు ముగ్గురు కమిషనర్లకు సమస్య తీవ్రత వివరించాము. కలెక్టర్‌కు సైతం సమస్యను వివరించాం. వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తొలగిస్తే కాలేజీ ప్రారంభం అవుతుంది.

– డా.ఇష్రత్, ప్రిన్సిపాల్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీ

సమస్యను పరిష్కరిస్తాం



డంపింగ్ యార్డు సమస్యతో గురుకుల కాలేజీ భవనం ప్రారంభోత్సవం అనేది ఆలస్యం అవుతుంది. ఈ విషయంపై పలు మార్లు కాలేజీ ప్రిన్సిపాల్ వినతి పత్రాలు సైతం ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ప్రత్యామ్నాయ స్థలం డంపింగ్ యార్డు కోసం చూస్తున్నాం. త్వరలోనే ఈ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. తెలుగు యూనివర్సిటీ, డబుల్ బెడ్ రూం వాసులు, హిల్ కౌంటీ వాసులు ఈ సమస్యపై కొంత కాలంగా తమ దృష్టికి తీసుకువస్తూనే ఉన్నారు.

– సాబేర్ అలీ, మున్సిపల్ కమిషనర్ నిజాంపేట్

వాకింగ్ చేస్తుండగా చైన్ స్నాచింగ్
కుత్బుల్లాపూర్: మార్నింగ్ వాకింగ్ చేస్తున్న ఓ మహిళ మెడలో నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు స్నాచర్లు నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి కేవీరెడ్డినగర్‌కు చెందిన బాలమణి బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న శ్రీమేరు ఆస్పత్రి సమీపంలో వాకింగ్ చేస్తుంది. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని 6 తులాల బంగారు పుస్తెల తాడును తెంచారు. దీంతో బాలమణి వారిని ప్రతిఘటించి గొలుసును గట్టిగా పట్టుకుంది. గొలుసులో కొద్దిభాగం (2 తులాలు) ఆమె చేతిలో ఉండిపోగా.. మిగతా నాలుగు తులాలతో స్నాచర్లు పరారయ్యారు. బాధితురాలు 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ విజయవర్ధన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు ఇచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో మహిళను టార్గెట్ చేసిన స్నాచర్లు

గుండ్లపోచంపల్లిలో జరిగిన ఘటనకు ముందు ఎన్‌సీఎల్ కాలనీ బస్టాప్‌లో ప్రియ అనే మహిళ వేచి చూస్తుంది. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన అగంతకులు ఆమె మెడలో పుస్తెల తాడును తెంపేందుకు యత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో పాటు అప్పుడే బస్సు రావడంతో స్నాచర్లు పరారయ్యారు. మంగళవారం రాత్రి పేట్‌బషీరాబాద్ నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే పైపు లైన్ రోడ్డులో బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి ఓ అపార్ట్‌మెంట్ ముందు నిలుచున్న మహిళ మెడలోంచి పుస్తెల తాడును తెంపేందుకు యత్నించినట్లు సమాచారం.

నిందితుడికి జైలు శిక్ష
జగద్గిరిగుట్ట: బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేసిన వ్యక్తికి జైలు శిక్ష పడిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహ వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ మహంకాళినగర్‌కు చెందిన కుమార్(30) కార్మికుడు. ఇదే ప్రాంతంలో ఉంటున్న బాలికను మూడేళ్ల క్రితం ప్రేమ పేరుతో వేధించాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పోక్సో కేసు నమోదైంది. ఈ క్రమంలో కూకట్‌పల్లి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టి నిందితుడికి శిక్ష ఖరారు చేశారు. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసులో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బంది కాశీనాథ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

ఇలా వదిలేస్తే ఎలా?
రంగారెడ్డినగర్: విద్యుత్ సరఫరాలో ఆటంకం తలెత్తకుండా ఉండేందుకు సమకూర్చుకున్న తాత్కాలిక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కొరవడింది. విద్యుత్ సిబ్బంది వాటిని ఎక్కడపడితే అక్కడ రోజుల తరబడి నిలుపుతున్నారు. పదిహేను రోజుల క్రితం ఏపీహెచ్‌బీ కాలనీ నుంచి గురుమూర్తినగర్‌కు వెళ్లే రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచారు. ఈ విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అక్కడ నుంచి తరలించారు. ప్రస్తుతం రెండువారాలుగా ఏపీహెచ్‌బీ కాలనీలోని టీజీ హెచ్‌బీ ఖాళీ స్థలం ఉన్న రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచారు. విద్యుత్ కార్యాలయ ఆవరణలో ఉండాల్సిన తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్లను ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రోడ్లపైనే చెట్ల కొమ్మలు
విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న అధికారులు వాటిని తరలించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీ– ఆదర్శ్‌నగర్ రోడ్డులో ఇటీవల విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది తొలగించారు. కొమ్మలను తరలించకుండా రోడ్డుపైనే డంప్ చేసి చేతులు దులుపుకున్నారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ఇది తమ పని కాదని, విద్యుత్ శాఖ అధికారులే తరలించాల్సి ఉంటుందని చెబుతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలను తొలగించిన వెంటనే తరలించే ఏర్పాట్లు చేసి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్



బ్రాహ్మణులపై దాడులు చేసే వారిని శిక్షించాలి



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న సేవా సంఘం సభ్యులు

సుభాష్‌నగర్: బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులు సరికాదని, దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, సూరారం సీఐ సుధీర్ కృష్ణలకు బుధవారంశ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. దొమ్మరి పోచంపల్లి గ్రామం (దుండిగల్ పీఎస్ పరిధి)లో బ్రాహ్మణుడు ఆలయ గర్భగుడిలో పూజలు చేస్తున్న సమయంలో ఒక వ్యక్తి గర్భగుడిలోకి ప్రవేశించి ఆయనపై దాడి చేశారన్నారు. సూరారం కాలనీ సంతోష్‌నగర్ (సూరారం పీఎస్ పరిధి)లో సంఘం ప్రధాన కార్యదర్శి నిట్టల వెంకట వీరభద్ర సుబ్రహ్మణ్య స్వామి ఇంటిపై ఇంటిపక్కవారు పలుమార్లు దాడులు చేయడంతో పాటు. అసభ్య పదజాలంతో దూషణలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు ఫిర్యాదులు ఇచ్చినా వారిలో ఎటువంటి మార్పు లేదని తెలిపారు. ఈ ఘటనలు శాంతి భద్రతలకు ముప్పు కలిగిస్తుండటంతో పాటు బ్రాహ్మణ సమాజ గౌరవం దెబ్బతింటోందని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారులు సర్వేపల్లి రమేష్‌కుమార్, సంఘ సభ్యులు గడ్డం రాంబాబు, సంఘం ప్రధాన కార్యదర్శి నిట్టల వెంకట వీరభద్ర సుబ్రహ్మణ్య స్వామి, కార్యదర్శులు రాచపూడి ప్రభాకర్, సింహాచలం శ్రీధరాచార్యులు, హరి రాఘవేంద్ర, అచ్యుతుని ఫణీంద్ర, గడ్డం గోవర్ధన్, వెంకటరమణ చారి, కులకర్ణి వెంకట రావు, లవ్లేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులతో కలిసి మొక్కకు నీళ్లు పోస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

దుండిగల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా దుండిగల్ తండా 2లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌టీ కార్పొరేషన్ ప్రతినిధి నర్సింగ్ రావు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పి సాత్విక్, వార్డు అధికారి సుభాష్, ఆర్పీలు శాంత, మంజుల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

అడ్డా కూలీలకు అండగా ఉంటా



బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజుతో అడ్డా కూలీలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ అడ్డా కూలీలకు ఏ సమస్య వచ్చిన తాను అండగా ఉంటానని, వాటి పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు అన్నారు. బుధవారం నిజాంపేట్ అడ్డా కూలీలు తమ సమస్యలను పరిష్కరించాలని నాగరాజును కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హసన్, సురేష్, నరసింహ, వెంకటేశ్వర్లు, అప్పారావు, కిరణ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్‌రెడ్డి

సుభాష్‌నగర్: దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం సూరారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. సూరారం మార్కెట్ యార్డ్ వద్ద నివాసముంటున్న అనిల్ కుమార్ ఇంట్లో ఈనెల 4న దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం విజయ్ కుమార్ సూరారం రామ్‌లీలా మైదానం చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. ఆరు లక్షల విలువ చేసే బంగారు నగలును స్వాధీనం చేసుకున్నారు. విజయ్ కుమార్ పాత నేరస్తుడని ఏసీపీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ధీరత్వానికి ప్రతీక ఐలమ్మ

వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రజక సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం, దొరల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన తెగువను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ధీరత్వానికి ప్రతీక అని వక్తలు అన్నారు.

– కుత్బుల్లాపూర్



కూన మహాలక్ష్మి నగర్‌లోని బతుకమ్మ కుంట వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు తదితరులు



జగద్గిరిగుట్ట చెక్‌పోస్ట్ వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జగన్, రజక సంఘం నాయకులు



షాపూర్‌నగర్ శుభం హోటల్ వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దేవేందర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు